మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



# తెలంగాణలో రానున్నది ఇందిరమ్మ రాజ్యం

- సంక్షేమాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తోంది
- 6 నెలల్లో 6 గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తోంది
- ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జునఖర్గే



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జునఖర్గే

**కల్వకుర్తి, నవంబర్ 25 ప్రభాతవార్త:** పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అసమర్ధ పాలనతో అప్పుల రాష్ట్రంగా మార్చారని ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జునఖర్గే విమర్శించారు. మిగులు రాష్ట్రాన్ని 5,70లక్షల వేల కోట్ల అప్పులు చేసిప్రతి ఒక్కరిపై రూ.1.40లక్షల అప్పు చేశారని ఆయన ఘాటుగా విమర్శించారు. ఆమనగల్లు మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో శనివారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా నిర్వహించిన విజయభేరి సభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జునఖర్గే, మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పాలనలో దేశ సమగ్రాభివృద్ధికి ఎంతగానో దోహద పడిందని, ఇందిరమ్మ రాజ్యంలో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు సంతోషకరమైన జీవితాన్ని పొందారని ఆయన కొనియాడారు. స్వాతంత్ర్యం తీసుకొచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనలో అనేక సంస్కరణలు చేపట్టి ప్రజారంజక పాలన అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకపోగా నియంత పాలనతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల నడ్డి విరిచిందని ఆరోపించారు. సంక్షేమాభివృద్ధికి పెద్దపీట వేసే కాంగ్రెస్ పార్టీ నాణ్యమైన ప్రాజెక్టులు నిర్మించి వ్యవసాయ రంగానికి అండగా నిలిచిందని కొనియాడారు. ఇందిరమ్మ పాలనలో దళితులకు భూ పంపిణీ, బ్యాంకుల జాతీయకరణ, వ్యవసాయ రుణాలవంటి సాహోసేపతమైన సంక్షేమ పథకాలను చేపట్టిందని ఖర్గే వివరించారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం లోపాయికారి ఒప్పందం పాలనలో ప్రజలపై అధిక ధరల భారాన్ని మోపి ప్రజలు నడ్డి విరుస్తుందని ఆయన దుయ్యబట్టారు. పెట్రోల్, డీజీల్, నిత్యావసర సరుకులు, వంట గ్యాస్‌ల ధరలను భరించే స్థితిలో ప్రజలు లేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌పార్టీని దెబ్బతీసేందుకే బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు లోలోపల కుట్రలు పన్నుతున్నాయని ఖర్గే ఆరోపించారు. ప్రధాని మోడీ ఎన్నికల ముందు నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15లక్షలు జమ చేస్తానని బూటకపు మాటల హామీ ఇచ్చి అధికారం చేజిక్కించుకున్నారని విమర్శించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ దళితులను ముఖ్యమంత్రి చేస్తానని మాట ఇచ్చి మోసం చేశారని, సచివాలయం ప్రజలకు అందుబాటులో ఉండని ముఖ్యమంత్రి కేసీఆర్ సమర్ధవంతమైన పాలన ఎలా చేస్తారని ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ అండదండలతో ల్యాండ్, సాండ్, వైన్ మాఫియా నడుస్తుందన్నారు. అవినీతి పాలనను అంతం చేయాలంటే ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టాం కట్టాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణ 6 గ్యారెంటీ పథకాలను 6 నెలల్లోపు అమలు చేస్తామని ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. కల్వకుర్తి ప్రాంతాభివృద్ధికి ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళి ప్రకారం సిబ్బంది విధులు నిర్వహించాలి

**ఎన్నికల్లో విధులు నిర్వహించే ఓపిఓలు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు : గద్వాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి**





**గద్వాల ప్రతినిధి నవంబర్25 ప్రభాతవార్త:** ఎన్నికల్లో విధులు నిర్వహించే ఓపిఓలు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. శనివారం గద్వాల ఎం.ఎ ఎల్. డి డిగ్రీ కళాశాల నందు ఏర్పాటు చేసిన ఓపిఓల శిక్షణ కార్యక్రమం, పోస్టల్ బ్యాలెట్ ద్వారాఓటు వేయడాన్ని రిటర్నింగ్ అధికారి అపూర్వ చౌహాన్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గానికి సంబంధించి 731 మంది ఉద్యోగ సిబ్బంది ఉన్నారని, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకుంటారని, కలెక్టర్ తెలిపారు. వనపర్తి, ఆలంపూర్, దేవరకద్ర, కొల్లాపూర్ నియోజక వర్గాల నుండి వచ్చిన వారు ఆయా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును మొత్తం 7 రూమ్‌లలో ఏర్పాటు చేసిన పోస్టల్‌బ్యాలెట్ ద్వారాఓటును వినియోగించుకున్నారని తెలిపారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో ఓటరు లిస్టులో పేర్లు చెక్ చేయడం, రిజిస్టర్ లో పేరు నమోదు చేయడం, ఇంకు వేయడం, బ్యాలెట్ బాక్స్ నందు బ్యాలెట్ పేపర్ వేయడం కలెక్టర్ దగ్గర ఉండి పరిశీలించారు. మాస్టర్ ట్రైనర్లచే ఓపిఓలకు పి.పి.టి ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పోలింగ్ రోజు ఎన్నికల నియమావళి ప్రకారం సిబ్బంది విధులు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం అలంపూర్ నియోజకవర్గానికి సంబంధించి ఎర్రవల్లి చౌరస్తాలోని ఏకశిల పాఠశాల నందు ఓపిఓలకు శిక్షణ కార్యక్రమం, పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లు వేయడాన్ని రిటర్నింగ్ అధికారి చంద్రకళ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఓపిఓలు మొత్తం 600 మంది ఉద్యోగులు ఉన్నారని పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును వినియోగించుకున్నారని తెలిపారు. ఈ రోజు ఓపిఓలు, ట్రైనర్లు ఓటు వేయని వారు రేపు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, ఆర్.డి.ఓ చంద్రకళ, ఎస్.డి.సి సుబ్రహ్మణ్యం, ఎం.ఆర్.ఓ నరేందర్, మంజుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులపై కఠిన చర్యలు

- జిల్లా అదనపు కలెక్టర్ చీర్ల శ్రీనివాసులు



**గద్వాల ప్రతినిధి నవంబర్25 ప్రభాతవార్త:** ఐడీఓసీ కార్యాలయంతోని రెవెన్యూ కలెక్టర్ చాంబర్ లో నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్మికశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ, విద్యా శాఖధికారులతో ఆయన సమావేశం అయ్యారు. అయన మాట్లాడుతూ బడీ ఈడు పిల్లలు విద్యా హక్కు చట్టం ప్రకారం స్వేచ్ఛగా చదువుకోవాలని, వారిని బడి బయట తిరగకుండా పనిలో పెట్టు కుంటే లేబర్‌చట్టం ప్రకారం నేరస్తులవుతారని అన్నారు. గట్టు మండలం విద్యలో అత్యంత వెనకబడిందని, పాఠశాలలో డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలన్నారు. 6 నుంచి 18 ఏళ్ల వయ సు గల పిల్లలను చదువుకోనియకుండా పనిలో పెట్టుకున్న యజామానులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలు ఎక్కడైనా పనిచేస్తుంటే ఫిర్యాదు చేయాలని అన్నారు. చిన్న పిల్లల హక్కులను కాపాడటానికి 365 రోజులపాటు రోజుకు 24 గంటలు టోల్ ఫ్రీ నంబర్ 1098 పనిచేస్తుందని, టోల్ ఫ్రీ నంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపిరు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు అక్కడికి చేరుకోని వారిపై చర్యలు తీసుకుంటారని అన్నారు. జిల్లా చైల్డ్ ట్రైన్ యూనిట్ లో కార్మికశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, సామాజిక కార్యకర్తలు సమన్వయంతో కలిసి పనిచేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా లేబర్ అధికారి మహేష్ కుమార్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి ముషాయిదా బేగం, సీడబ్ల్యూసీ చైర్మన్ సహదేవ్, మెంబర్ శైలజ, సామాజిక కార్యకర్త పద్మ, డీసీపీ యూనిట్, చైల్డ్ ట్రైన్ యూనిట్ సభ్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించం

- జిల్లాలో ఇప్పటి వరకు రూ.2.90కోట్ల మద్యం పట్టివేత
- నిబంధనలు అతిక్రమించిన మోతి వైన్ షాపు సీజ్
- 488 కేసులు నమోదు
- నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్




ఎన్నికల నిబంధనల్లో పట్టుకున్న మద్యాన్ని సీజ్ చేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 25 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా మద్యం అక్రమ రవాణా, విక్రయాలు, గంజాయి తరలింపు, గుడుంబా తయారీ తరలింపు విక్రయాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరైన ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఊపేక్షించేది లేదని నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల గడువు తర్వాత నిబంధనలు ఉల్లంఘించే మద్యం దుకాణాలపై ఎక్సైజ్ శాఖ కఠినంగా వ్యవహరిస్తూ నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలకు పూనుకోవాలని కలెక్టర్ ఎక్సైజ్ శాఖ కఠినంగా వ్యవహరిస్తూ నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలకు పూనుకోవాలని కలెక్టర్ ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని 3 నియోజకవర్గాల పరిధిలో ఓటర్లను ప్రభావితం చేసే మద్యం, గుడుంబాను అరికట్టేందుకు వ్యూహాత్మకంగా జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతుందన్నారు. ఇందుకోసం జిల్లాలోని నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లో చెక్ పోస్టుల ఏర్పాటు చేసి జిల్లా ఎక్సైజ్ శాఖ, పోలీసులు సమన్వయంతో ఇప్పటి వరకు రూ.2.90కోట్ల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎన్నికల నిబంధనలు అతిక్రమించి మద్యం తరలింపుకు కారణమైన మోతి వైన్ షాపును సీజ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అక్రమంగా తరలించిన మద్యాన్ని రికవరీ చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లాలో 2వేలలీటరల మద్యాన్నిపట్టుకున్నామన్నారు. దాని విలువ సుమారురూ.2.90కోట్లు ఉంటుందన్నారు. గుడుంబా, అక్రమ మద్యం, గంజాయి రవాణాపై కూడా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. అందులో 275 కేసులు గుడుంబాకు సంబంధించినవి కాగా 189 కేసులు అక్రమ మద్యం తరలించే వారిపై కేసులు చేసినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బాంద్రీషాపుల్లో మద్యం అమ్మకాలపై దృష్టి సారించారని, ప్రతి రోజు క్లోజింగ్ స్టాక్ రిజిస్టర్ చెక్ చేస్తూనే అలాగే ఎస్ఎస్‌టీంల పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. రాజకీయ పార్టీలకు మద్యం పెద్ద ఎత్తున వెళ్లకుండా పకడ్బంది చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్టాక్ రిజిస్టర్ నిర్వహణ, బిల్లు పుస్తకాలు వినియోగించని షాపుల యజమానులపై కేసులు నమోదు చేయడంజరుగుతుందని, అక్రమ మద్యాన్ని పూర్తిగా నివారించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఆయనతెలిపారు. రాత్రి 10 గంటల వరకు గడు వు ఉల్లంఘిస్తేమద్యం దుకాణాలపై జిల్లాయంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తుందని, జిల్లాలో ఎవరైన మద్యం దుకాణదారులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షిం చేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలోఏర్పాటు చేసినకంట్రోల్‌రూమ్ నెంబరుకు 9391151946కుసమాచారమందించాలని సూచించారు.



నిబంధనలు ఉల్లంఘించిన మోతి వైన్స్‌ను సీజ్ చేస్తున్న దృశ్యం

# స్వేచ్ఛగా శాంతియుతంగా ఎన్నికలు జరపాలి

- సూక్ష్మ పరిశీలకులది కీలక పాత్ర : జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు సంజయ్‌కుమార్ మిశ్రా



**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 25 ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికలను స్వేచ్ఛగా శాంతియుత వాతావరణంలో నిర్వహించడంలో సూక్ష్మ పరిశీలకులది కీలక పాత్ర అని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు సంజయ్‌కుమార్ మిశ్రా అన్నారు. శనివారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన ఎన్నికల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్స్) సాధారణ పరిశీలకులకు అనుసంధానంగా ఎన్నికల సంఘంచే నియమించబడతారని, అందువల్ల పూర్తి జాగ్రత్తగా, నియమ నిబంధనల ప్రకారం బాధ్యతతో విధులు నిర్వహించాలని ఆయన కోరారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరగకుండా స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించేలా సూక్ష్మ పరిశీలకులు పని చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రంలో అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి సాధారణ పరిశీలకులకు నివేదిక సమర్పించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన సూక్ష్మపరిశీలకులుసమర్పించాల్సి న రిపోర్టులు, పోలింగ్ కేంద్రంలో చేయవలసిన విధులు, పరిశీలించాల్సి న అంశాలు, తదితర అన్ని అంశాలపై సూచనలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. రవినాయక్ మాట్లాడుతూ ఎన్నికలలో సూక్ష్మ పరిశీలకులుగా విధులకు నియమించబడిన ఉద్యోగులందరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని, ఇందుకు ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని అందరూ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ క్యాస్టింగ్ ఉంటుందని, అయినప్పటికి సూక్ష్మ పరిశీలకులు వారికి కేటాయించిన విధులు పూర్తి జాగ్రత్తగా నిర్వహించాలని కోరారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కాల్వ భాస్కర్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి, డీఈఓ రవిందర్ ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.



హాజరైన సూక్ష్మ పరిశీలకులు

# కురుమయ్యా.. సల్లంగా చూడవయ్యా

- దాసంగాలతో స్వామికి మొక్కులు
- యాత్రికులతో కిటకిటలాడిన వ్యాపార సముదాయాలు



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

**చిన్నచింతకుంట, నవంబరు25 ప్రభాతవార్త:** పల్లెజనుల ఆరాధ్య దైవం, కొలిచిన వారికి కొంగు బంగారంగా కొలువబడుతున్న శ్రీ కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీక శనివారం రోజున జిల్లా నలుమూలల నుంచే కాకుండా పల్లె ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనంతో కురుమతి కొండ కిక్కిరిసిపోయింది. జాతర మైదానం భక్తులతో నిండిపోయింది. కొండ దిగువ నుంచి స్వామివారి సన్నిధి వరకు భక్తులు క్యూలైన్లలో నిలుచుని స్వామివారిని దర్శించుకున్నారు. కురుమయ్య మమ్ములను సల్లంగా చూడవయ్యా అంటూ భక్తులు గోవింద నామ స్మరణతో కాంచన గుహ పులకించింది. శ్రీ లక్ష్మిదేవి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

**దాసంగాలతో మొక్కులు:** పల్లె ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనం స్వామివారికి కొత్త మట్టి కుండలో పచ్చిపులుసు, పరమాన్నాన్ని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

యాత్రికులతో వ్యాపార సముదాయాలు సందడి... పట్టణ, పల్లె ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్న అనంతరం జాతర మైదానంలోని పలు వ్యాపార సముదాయాలు యాత్రికులతో సందడిగా మారాయి. మిఠాయి దుకాణాలు, ఫ్యాన్సీ దుకాణాలు యాత్రికుల కొనుగోళ్లతో నిండిపోయింది. రంగుల రాట్నాల వద్ద చిన్నారులు, యువతీ, యువకులు సరదాగా గడిపారు. ఈ జాతరలో మట్టి గాజులకు ప్రాముఖ్యత ఎంతో ఉంది. పల్లె ప్రాంతాల భక్తులు తమ కుటుంబంలోని ఆడబిడ్డలకు మట్టి గాజులు వేయించడం ఆనవాయితీ, మట్టి గాజుల దుకాణాలు మహిళ యాత్రికులతో కోలాహలంగా మారింది. ఆదివారం పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. అదేవిధంగా సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.



స్వామివారి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తజనం





# భక్తి శ్రద్ధలతో శని త్రయోదశి



శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**బిజినేపల్లి, నవంబరు25 ప్రభాతవార్త:** వడ్డెమాన్ గ్రామంలోని శనేశ్వరస్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశి సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. కార్తీక శని త్రయోదశి శనివారం అమావాస్య ముందు శనిత్రయో దశి రావడంతో శ్రీ సార్థా సప్తజేష్ట మాత సమేత శనేశ్వర స్వామికి ప్రత్యే కంగా తిల తైల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు వారి జన్మ నిత్యా, గోచార రిత్యా ఉన్న అర్థాష్టమశని, అష్టమశని, ఏలినాటి శని, నక్షత్రంలో గోచార రిత్యా, సంచారరిత్యా శనిగ్రహదోషాల నివారణకు, శనిగ్రహ శాంతి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు డా. గవ్వమఠం విశ్వనాథశాస్త్రి మాట్లాడుతూ శనివారం త్రయోదశి రావడంతో శనేశ్వర స్వామిని పూజించిన విశేష పుణ్యఫలితం అందుతుందని తెలిపారు. భక్తులు శనేశ్వర స్వామిని నువ్వుల నూనె, జిల్లెడుపూలు, జమ్మి ఆకులతో పూజించారు. ఆలయ ఆవరణలో గల బ్రహ్మ సూత్రం గల పరమ శివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, శివ అష్టోత్తరం, అర్చనలు వీరశైవ ఆగమాను సారంగా నిర్వహించారు. అనంతరం మహాగణపతి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో తెల్లవారుజామునుండే స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు, అష్టోత్తర, అర్చనలు, పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తెల్లవారుజాము నుండి భక్తులకు నీటి వసతిని, అల్పాహార, భోజన వసతిని ఆలయ నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలోఆలయ ఛైర్మన్‌వి.గోపాల్‌రావు, గ్రామ సర్పంచ్ వంగ సుదర్శన్ గౌడ్, ఆలయ కమిటి సభ్యులు వీరశేఖర్, ప్రభాకర్, పుల్లయ్య, ఆలయ అర్చ కులు గవ్వమఠం శాంతికుమార్, ఉమామహేశ్వర్, జయంతి, మల్లికార్జున శాస్త్రి, శ్రావణ్‌కుమార్, శివకుమార్, సిబ్బంది గోపాల్‌రెడ్డి, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రచార కాన్వాయ్ వాహనాల పరిశీలన

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 25 ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికల సందర్భంగా జిల్లాకు నియమించబడిన ఎన్నికల పరిశీలకులు ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు డా. కుందన్ యాదవ్ వివిధ పార్టీల ప్రచారాల కాన్వాయ్‌లను, వాహనాలను ఇతర అంశా లను పరిశీలించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో భారత రాష్ట్ర సమితికి చెందిన ప్రచార కాన్వాయ్‌ని అందులో ఉన్న వాహనాలు, వాటి అనుమతులు, ఇతర అంశాలను పరిశీలించగా, మహబూబ్‌నగర్ మండలం చౌదర్‌పల్లి వద్ద బిజెపికి చెందిన ప్రచార కాన్వాయ్, వాహనాల అనుమతి తదితర అంశాలను పరిశీలించారు.




వాహనాలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

## విద్యార్థులచే రాజ్యాంగ ప్రతిజ్ఞ



విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

**చిన్నచింతకుంట, నవంబరు25 ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను శనివారం అప్పంపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బాలసభ కార్యక్రమంలో విద్యార్థులు భారత రాజ్యాంగ ప్రత్యేకతలను వివరించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిశంకర్ విద్యార్థుల చేత భారత రాజ్యాంగ ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చక్రవర్తిగౌడ్, ఎల్లయ్యలు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను విద్యార్థులకు వివరించారు. రాజ్యాంగం రూపకల్పనలో ఎంతో మంది మహనీయులు అహర్నిశలు శ్రమించారని వారన్నారు. పౌరులకు రాజ్యాంగమే రక్షణ కవచంగా నిలు స్తోందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ కమిటి అధ్య క్షుడు డా.బాబు రాజేంద్రప్రసాద్, ముసాయిదా కమిటీ ఛైర్మన్ డా.బిఆర్ అంబేద్కర్ కృషిని భారత జాతి ఎల్లప్పుడు గుర్తుంచుకుంటుందని ఉపాధ్యాయులు తెలిపారు. వివిధ అంశాలపై విద్యార్థుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, సుశీల, అనురాధ, సాదియా ఫర్హాత్ పాల్గొన్నారు.

## ప్రియాంకగాంధీ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



ప్రియాంక గాంధీ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు 25 ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొడంగల్ నియోజకవర్గం, కోస్గిలో కాంగ్రెస్ పార్టీ ఏఐసిసి అగ్రనేత ప్రియాంకగాంధి సోమవారం రానున్న సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తాండూరు ప్రధాన రహదారి కుడివైపు గల హెలిప్యాడ్ స్థలాన్ని బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించి, పబ్లిక్ గ్యాలరీ, మీడియా గ్యాలరీ, బ్యారికేడ్స్ ఏర్పాటు, పార్కింగ్ బందోబస్తు, పార్కింగ్ డైవర్షన్ మొదలగు విషయాలపై అధికారులు భద్రత పరమైన సూచనలు ఇచ్చారు. ఎస్పీతో పాటు సిఐ జనార్ధన్, ఎస్సై శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

## 27న అమరచింతకు రాజాసింగ్ రాక

**అమరచింత, నవంబర్ 25, ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్ రెడ్డికి మద్దతుగా ఈ నెల 27న అమరచింతకు గోషామహల్ బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ వస్తున్నారని బిజెపి పట్టణ అధ్యక్షులు, క్యామ భాస్కర్, బిజెపి రాష్ట్ర నాయకులు, మెరువ రాజు, మహంకాళి శ్రీనివాసులు, దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని మహంకాళీ శ్రీనివాసులు హెల్ప్ ఫ్యాడ్ పనులను పర్యవేక్షించారు. అమరచింత పట్టణంలో బిజెపి అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్ రెడ్డికి మద్దతుగా భారీ సభ ఏర్పాటు చేస్తున్నామని ఈ సభకు గోషామహల్ బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ హాజరవుతున్నారని ఈ సభకు మక్తల్ నియోజకవర్గంలో ప్రజలు భారీగా పాల్గొనాలని వారు కోరారు.

## మల్దకల్ శ్రీతిమ్మప్ప స్వామిని దర్శించుకున్న ఎన్నికల పరిశీలకులు



**గద్వాల ప్రతినిధినవంబర్ 25 ప్రభాతవార్త:** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శనివారం జోగులాంబ గద్వాల జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు వసంతకుమార్ సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి దేవస్థానం నిర్వాహకులు పట్వారీ అరవిందరావు దేవాలయ ఈవో సత్య చంద్రారెడ్డి అర్చకులు స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ విశిష్టతను వివరించి ఆయనకు స్వామి వారి శేష వస్త్రంతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్వారి అరవిందరావు, చంద్రశేఖర్ రావు, వీరరెడ్డి, శ్రీను, గోవర్దన్ గౌడ్, వాల్మీకి పూజారులు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెల్కిచర్లలో విద్యార్థుల మాక్ పోలింగ్

**-పోలింగ్, ఈవీఎంల పట్ల అవగాహన..**



**భూత్పూర్, నవంబర్ 25, ప్రభాతవార్త :** వారం రోజుల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని భూత్పూర్ మండలం వెల్కిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాఠశాలలో ఇంచార్జి హెచ్ఎం రాధాకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ విధానం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం) వాడకం పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థుల మేదస్సు ను పలువురు ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు విజయలక్ష్మి, జయలక్ష్మి, సువర్ణ, సుజాత, రాజేశ్వరి, రేణుకాభాయ్, ఉపాధ్యాయులు రవీందర్, సురేష్‌బాబు, బాలలింగయ్యతో పాటు సీఆర్పీ ఇక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

**బిజినేపల్లి, నవంబరు 25 ప్రభాతవార్త:** మమ్మాయిపల్లి పరిధిలోని మార్కండేయ ఆలయంలో మఠిశనివారం ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఇటీవలే ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఇటీవలే మార్గొండయ్య లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మార్కండేయ ఆలయం సమీపంలోని చెరువులోకి కృష్ణా జలాలు రావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణా జిల్లా రాకతో 18 తండాలతో పాటు ఐదు గ్రామాలు సాగునీరు తాగునీరుతో కళకళలాడు తాయని అన్నారు. అనంతరం మార్కండేయ ఆలయంలో శివుడికి జలాభిషేకం, రుద్రాభిషేకం, శివపంచాక్షరి మంత్రాలు జపిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగం శశిధర్‌రెడ్డి, జక్కారఘు నందన్‌రెడ్డి, గంగనమోని కిరణ్, ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, పులెందర్‌రెడ్డి, చిన్నారెడ్డి, శేఖర్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# ఘనంగా వ్యాయామ ఉపాధ్యాయుల దినోత్సవం



పీఈటీలను సన్మానించిన దృశ్యం

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు25 ప్రభాతవార్త:** ఫాదర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్ ఇండియా, భారతదేశంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండర్ హ్యారి క్రౌ బక్ జన్మదినం నవంబరు 25న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ డే (వ్యాయామ ఉపాధ్యాయుల దినోత్సవం)ను పురస్కరించుకుని నవంబరు 25న శనివారం, విశ్రాంత పీఈటి బి. గోపాలం అధ్యక్షతన మక్తల్ శ్రీ సత్యసాయి బాబా మందిరంలో ఉదయం 10 గం.లకు జరిగిన సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పీడీలు, పీఈటీలు, నిరుద్యోగ పీఈటీలు, రిటైర్డ్ పిడి, పీఈటీలు వంద మంది హాజరయ్యారని బి.గోపాలం తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుల దినోత్సవం గురించి బి. గోపాలం మాట్లాడుతూ ఇండియాలో 1920 నుండి వ్యాయామ విద్యను హ్యారి క్రౌబక్ మద్రాస్ నగరంలో ప్రవేశపెట్టారని ఆయన స్థాపించిన ఫిజికల్ ఎడ్యుకేషన్ భారతదేశంలో క్రీడారంగము అభివృద్ధి చెందిందని ఆయన ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన 100 మంది పీఈటీలను శాలువా, మెమెంటోను అందజేసి ఘనంగా సన్మానించారు. విచ్చేసిన పీఈటీలు మాట్లాడుతూ రిటైర్మెంట్ తర్వాత కూడాబి.గోపాలం క్రీడారంగానికి సేవచేస్తున్నందుకు ఆయనను అభినందించారు. పీఈటీలను గౌరవించి ప్రోత్సహించుటకు, మన ప్రొఫెషన్ను మనమే గౌరవించుకోవాలని, మంచి ఉద్దేశంతో, అందరికి సన్మాన కార్యక్రమంఏర్పాటు చేసినట్లు విశ్రాంతపీఈటి బి.గోపాలం తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని క్రీడా ఆణిముత్యాలను వెలికితీస్తున్న, క్రీడా రంగానికి సేవలందిస్తున్న పీడీలను, పీఈటీలను ప్రభుత్వ పరంగా గౌరవిస్తే బాగుండేదని ఆయన అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో విశ్రాంత పీఈటీ బి. గోపాలం, విశ్రాంత పీడీలు కె. ప్రభాకర్, వీర వసంతరాయుడు, పీఈటీలు అర్చన, స్వరూప, పుష్పలత, మయూరి, భీమిరెడ్డి, కె.రాకేష్, అబ్దుల్ రావూఫ్, సి.అమ్రేష్, ఎన్. రాఘువేందర్, షాబుద్దీన్, దామోదర్, ఎస్.రమేష్‌కుమార్, హనీఫ్, మధు, రామాంజనేయులు, శశికళ, తిరుపతమ్మ, సిద్ధు, మారుతి, సి.రవి, శ్రీలత, శివకుమార్, ఇబ్రహీం, చంద్రకళ, దేవకమ్మ, వేదవతి, స్వప్న, హర్షవర్ధన్, సునిత, దండులక్ష్మి, 100 మంది పీఈటీలు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్‌కు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ పట్టా పొందిన కలగొని వెంకటేష్‌గౌడ్

**కల్వకుర్తి, నవంబర్ 25 ప్రభాతవార్త:** ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేస్తున్న కలగొని వెంకటేష్‌కు తెలుగు విభాగంలో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ గ్రామానికి చెందిన కలగొని వెంకటేష్‌గౌడ్ ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగు శాఖ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. వెంకటేష్ ఆధునిక సాహిత్యం-వృత్తి జీవన చిత్రణ అనే అంశంపై ఆచార్య సాగి కమలాకర శర్మ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ప్రస్తుతం కల్వకుర్తి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేస్తున్నారు. మారుమూల చారకొండ గ్రామం నుంచి ఓయూలో తెలుగు పీజీ చేశారు. కల్వకుర్తి శ్రీ భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి ఉపాధ్యాయ కళాశాలలో బీఎడ్ పూర్తి చేశారు. ఉపన్యాసకులు వెంకటేష్‌కు డాక్టరేట్ రావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీపాద శార్వాణి, అధ్యాపకులు మల్లేష్ యాదవ్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు మహమ్మద్, రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌బీఎమ్ఎస్ పూర్వ విద్యార్థులు దుబ్బ నాగేష్, గోపాల్, అశోక్‌రెడ్డి, రాజుగౌడ్, హరిలాల్, తిరుపతి, రమేష్‌చౌహాన్, మహేష్, కుమార్, మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు అభినందులు తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ బూటకపు వాగ్దానాలు నమ్మొద్దు

**● వనపర్తి మున్సిపల్ ఛైర్మన్ గట్టు యాదవ్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వనపర్తి మున్సిపల్ ఛైర్మన్

**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 25, ప్రభాతవార్త:** నామినేషన్, బహిరంగ సభకు తరలివచ్చిన ప్రజలకు డబ్బులు ఇస్తానని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తూడి మేఘా రెడ్డి సరికొత్త నాటకానికి తెర మీదకు తెచ్చారని వనపర్తి మున్సిపల్ ఛైర్మెన్, గట్టు యాదవ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల, రైతుల దగ్గరకు వెళ్ళి కర్ణాటక తరహాలో ఒక కూపన్ అందజేసి, ఈ కూపన్ తీసుకొనికాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే వచ్చే నెల నుండి రూ.2500 రూపాయలు మీ బ్యాంకు అకౌంట్లో డబ్బులు వేస్తామని మభ్యపెడుతున్నారని విమర్శించారు. ప్రజల నుండి పట్టాదారు జిరాక్స్, బ్యాంక్‌అకౌంట్ జిరాక్స్ కాపీలనుసేకరిస్తున్నారని, ఇటువంటి మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని బి.ఆర్.ఎస్ పార్టీ ప్రజలకు విజ్ఞప్తి చేస్తుం దని అన్నారు. కేవలం డబ్బు మధంతో రాజకీయాలకు వచ్చి ప్రజలో అపారమైన హంగామా సృషించిన మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీని, నమ్ము కున్న నాయకులను, ప్రజలను మోసం చేశారని అన్నారు. ఎన్నికల సంఘం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఎన్నికల నియమావళి ఉల్లంఘన పరిగణలోకి తీసుకుని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పత్రికా సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్, వాకిటి శ్రీధర్ పార్టీఅధ్యక్షులు పలుసా, రమేష్‌గౌడ్‌మీడియా కన్వీనర్ నందిమల్ల, అశోక్, నాయకులు ఉంగ్లం తిరుమల్, ఎర్ర శ్రీనివాసులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హాయంలోనే సబ్బండ వర్గాలకు సమన్యాయం

**● పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్

**అమరచింత, నవంబర్25, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ద్వారానే తెలంగాణ రాష్ట్ర సబ్బండ వర్గాలకు సమ న్యాయం జరుగుతుందని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజ్ గౌడ్ అన్నారు. శనివారం అమరచింత మండల పరిధిలోని నందిమల్ల, మిట్ట నందిమల్ల, గ్రామాలలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అలాగే మస్తిపురం గ్రామంలో పాస్టర్ల చర్చిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి దళితులకు మూడెకరాల భూమి, దళిత బంధు ఇస్తానని హామీ ఇచ్చిన ఇప్పటివరకు అమలు చేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వం పాస్టర్లకు గౌరవేతనం ఇస్తానని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తక్షిణమే పాస్టర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవేతనము అమలు చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికలలో టిఆర్ఎస్, బిజెపి పార్టీలు కలిసి పని చేస్తున్నాయని టిఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే బిజెపి పార్టీకి వేసినట్లేనని రెండు పార్టీలు తోడు దొంగలని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, అయూజ్ ఖాన్, మాజీఎంపిటిసి, తిరుమలేష్, గడ్డం శ్రీకాంత్, కావలి రవి, మస్తీపురం సత్తన్న, రవి, చంద్రశేఖర్‌రెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాస్టర్లు పాల్గొన్నారు.

# బొల్లారం కొర్లకుంట రహదారికి వెంటనే మరమ్మతులు చేయాలి



రహదారిని పరిశీలిస్తున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

**వీపనగండ్ల, నవంబర్25, ప్రభాతవార్త :** వీపనగండ్ల మండల కేంద్రంలోని బొల్లారం నుండి కొర్లకుంట వరకు వెళ్లే ఆర్ అండ్ బి ప్రధాన రహదారి దెబ్బతిన్న రోడ్డుకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ రోడ్డును శనివారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.కళావతమ్మ, కౌన్సిల్ సభ్యులు కాకం బాలస్వామి, పానగల్ మండల కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ పరిశీలించారు. చాలా చోట్ల బీటీ రోడ్డు దెబ్బతిని గుంతల మయంగా మారిందని, ఈ రహదారికి వెంటనే మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాక ప్రధాన బీటీ రోడ్డు కొర్లకుంట మధ్య కల్వర్ట్ పల్లంగా ఉండటంతో వర్షం పడితే నీరు ప్రవాహీనికి రాకపోకలకు ఆటంకంగా ఏర్పడుతుందని ఆరోపించారు. రోడ్డు డ్యామ్ నిర్మించాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించాలని నిర్లక్ష్యం వహిస్తే కొర్లకుంట బొల్లారం ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అధికారులు ప్రజల సమస్యలను గుర్తించి ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది కాకుండా, ప్రమాదాలు జరగకుండా చూడాలని ఈ సందర్భంగా వారిక విజ్ఞప్తి చేశారు.

# ప్రిన్సిపాల్ విద్యారాణికి ఫిజిక్స్‌లో పిహెచ్‌డి



ప్రిన్సిపాల్ విద్యారాణికి ఫిజిక్స్‌లో పిహెచ్‌డి అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

**బిజినేపల్లి, నవంబరు25 ప్రభాతవార్త:** విద్యార్థుల పాలిట విద్యా ప్రదాయినీ విద్యారాణికి అపూర్వ గౌరవం దక్కింది. ఎస్వీ జీడీసీ, పాలెం ప్రిన్సిపాల్ విద్యారాణికి ఫిజిక్స్‌లో పిహెచ్‌డి అవార్డు ప్రధా నం జరిగింది. అవిశ్రామ విద్యాసేద్యంలో పోరాడుతూ తమ జ్ఞాన పటిమకు నిదర్శనంగా నేడు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఫిజిక్స్‌లో పిహెచ్‌డి పొందింది. డీన్, సైన్సెస్ విభాగము మరియు ఛైర్మన్, బోర్డు ఆఫ్ స్టడీస్, సీనియర్ ప్రొ॥ డా. డి.కరుణా సాగర్ పర్యవేక్షణలో స్టడీస్ ఆన్ ద పెర్‌ఫార్మెన్స్ ఆఫ్ అబరేటెడ్ ఆప్టికల్ ఇమేజింగ్ సిస్టమ్స్ విత్ వేరియబుల్ అపోడైజేషన్ అనే అంశం మీద పరిశోధన చేసినందుకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసింది. చదువుపై విద్యారాణి దినదినాభివృద్ధి చెందుతూ జీవితంలో ఎదురొస్తున్న ఎన్నో ఒడిదుడుకులను జయిస్తూ, ఉన్నత స్థాయికి చేరుకున్నది. ఎదుగుదలకు, చకచకటి సంస్కారానికి విద్యనే ప్రధాన కారణమని భావించిన వీరు ప్రాథమిక విద్యనంత కాంతిమంత అకాడమిలో, హైస్కూల్ విద్య దీపికా మెమోరియల్ హైస్కూల్ విద్యదీపికా మెమోరియల్ హైస్కూల్ షాద్‌నగర్‌లో చదివి అత్యుత్తమ స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇంటర్ విద్యను సెయింట్ పయస్ మహిళా జూనియర్ కళాశాల హైదరాబాద్‌లోను, ఇదే కళాశాలలో డిగ్రీ విద్యను కూడా పూర్తి చేసుకొని, డిస్టింక్షన్‌లో పాస్‌అయ్యారు. యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ సైన్స్ ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎంఎస్‌సి (అప్లైడ్ ఎలక్ట్రానిక్స్) కోర్సును పూర్తి చేసుకుని, 2008లో ఏపిపిఎస్సీ జేఎల్ అర్హత సంపాదించి ప్రభుత్వ కొలువును సంపాదించారు. విరామం అనేది లేకుండా, చదువులో ముందు ముందుకు విద్యార్థులను తీసుకుని వస్తూ, ఏపి సెట్ అర్హతను సంపాదించారు. ప్రమోషన్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫిజిక్స్‌గా ఎంవిఎస్ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) మహబూబ్‌నగర్‌కు వచ్చి పనిచేశారు. ఆ తర్వాత ట్రాన్స్‌ఫర్‌లో పాలెం డిగ్రీ కళాశాలకు వచ్చి ప్రిన్సిపల్‌గా పదవి బాధ్యతలు చేపట్టి 2017లో పిహెచ్‌డిలో ప్రవేశం పొందారు. అహర్నిశలు కృషిచేసి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డి సీటు సంపాదించారు. సీనియర్ ప్రొ॥ కరుణాసాగర్ ఆధ్వర్యంలో పరిశోధక విద్యార్థినిగా చేరినందుకు నేనెంతో అదృష్టంగా భావిస్తున్నాను. అనునిత్యం నన్ను ముమ్ముందుకు నడిపించిన వారు మా అమ్మ డి.శ్యామల, రిటైర్డ్ హెడ్మాస్టర్ ఎస్. వెంకటన్న, రిటైర్డ్ ఎట, నా జీవిత భాగస్వామి, డి. ప్రవీణ్‌బాబు, ఎయిర్ వెటరన్, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అండ్ ఫార్మర్ సీఎస్డి మేనేజర్‌ల ప్రోత్సా హం నన్ను ఇంతటి దానిగా చేసిందని, నాకు ధైర్యాన్ని ఇచ్చిందని అందుకే నేను ఈ స్థాయికి ఎదిగానని అభిప్రాయపడ్డారు. వీరికి నేను ఏమిచ్చినా రుణము తీర్చుకోలేనని వారి ఆశీస్సులు నాపై ఎప్పటికి ఉండాలని కోరారు. డాక్టరేట్ పట్టా ప్రధానము అయినందుకు తమ గురువులు, పాలెం కళాశాల అధ్యాపక అధ్యాపకేతర మరియు విద్యార్థులు, తమ కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## బర్రెలక్కకు మద్దతుగా జేడీ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న జెడి లక్ష్మీనారాయణ

**వీపనగండ్ల, నవంబర్ 25, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో అసెంబ్లీ ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న బర్రెలక్కకు మాజీ సిబిఐ జేడీ లక్ష్మీనారాయణ మద్దతు తెలిపారు. .ఈ సందర్భంగా సిబిఐ మాజీ డైరెక్టర్ జెడి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యువత రాజకీయాల్లో రాణించాలని అప్పుడే దేశం, రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని రాజకీయాల్లో మార్పులు వస్తాయని తెలిపారు. బర్రెలక్క ఎంతో ధైర్యంగా ముందుకు వచ్చి ఎన్నికల్లో పోటీ చేశారన్నారు ఆమెకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. యువత బర్రెలకును స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

## సూక్ష్మ పరిశీలకుల రాండమైజేషన్




రాండమైజేషన్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు సంజయ్‌కుమార్ మిశ్రా, జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 25 ప్రభాతవార్త:** సూక్ష్మ పరిశీలకుల రాండమైజేషన్ కార్యక్రమం శనివారం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు సంజయ్‌కుమార్ మిశ్రా ఆధ్వర్యంలో సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని ఎన్ఐసిలో నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్ జి. రవినాయక్, జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి సత్యనారాయణమూర్తి తదితరుల ఆధ్వర్యంలో సూక్ష్మపరిశీలకుల రాండమైజేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగింది. శాసనసభ ఎన్నికలలో భాగంగా 218 మంది సూక్ష్మ పరిశీలకులకు ఉదయం శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

## కేసీఆర్ తిన్న అవినీతి సొమ్మును కక్కిస్తాం

- కల్వకుంట్ల కుటుంబాన్ని జైలుకు పంపుతాం
- రానున్నది ఇందిరమ్మ రాజ్యమే
- బీఆర్ఎస్ పాలనలో అంతా అవినీతి, దోపిడీ
- కాంగ్రెస్ చరిత్ర మరిచిన కేసీఆర్
- ఆమనగల్లు బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ధ్వజం



ఆమనగల్లులో కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

**కల్వకుర్తి, నవంబర్ 25, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతి, దోపిడిని బయటపెట్టి కల్వకుంట్ల కుటుంబాన్ని చెర్లపల్లి జైలుకు పంపుతామని టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని అవినీతి మయం చేసిన కేసీఆర్‌కు ప్రస్తుతం ఓటమి భయం పట్టుకుందని, డిసెంబర్ 3వ తారీఖున తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇందిరమ్మ రాజ్యం తీసుకువస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ప్రభుత్వ కళాశాల మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయభేరి సభ నిర్వహించారు. సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, రాష్ట్ర పార్టీ ఇంఛార్జీ మణిక్ ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొని కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ప్రసంగించారు. ఈ సంధర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జైలుకు పంపడం ఖాయమని, చర్లపల్లి జైలులో డబుల్ బెడ్‌రూంను మంజూరు చేస్తామన్నారు. కాంగ్రెస్ పాలనను విస్మరించిన కేసీఆర్‌కు దేశంలో, రాష్ట్రాభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన మార్కును మరిచిపోయారని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యంలో దళిత, గిరిజన ప్రజలకు లక్షలాది ఎకరాల భూపంపిణి చేపట్టిందని రేవంత్‌రెడ్డి కేసీఆర్ తెలుసుకోవాలని సూచించారు. నాగార్జునసాగర్, నెట్టంపాడు, శ్రీరామ్‌సాగర్ వంటి అనేక ప్రాజెక్టులు, విద్యుత్‌తోపాటు పేదల సంక్షేమానికి ఇందిరమ్మ అమలు చేసిన సంక్షేమాభివృద్ధి పథకాలను తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు. సీఎం కేసీఆర్ పాలనలో అవినీతి, దోపిడి రాజ్యమేలిందని, కబ్జాలు తప్ప తెలంగాణకు చేసిందేమి లేదన్నారు. నెహ్రూ, ఇందిరమ్మ, రాజీవ్‌గాంధీ పాలనతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో ప్రజారంజక పాలన కొరకై అనేక సంస్కరణలు తీసుకువచ్చి పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. కాంగ్రెస్ పాలనలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికి ప్రజలకు మేలైన సేవలందిస్తుంటే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి చోటుచేసుకుని భవిష్యత్తును ప్రశ్నార్థకంగామార్చిందని విమర్శించారు. పాలమూరు ఎంపీగా కేసీఆర్ ఏమిసాధించారో ప్రజలు గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఎందుకు పూర్తి చేయలేకపోయరని ప్రశ్నించి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వెనుకబాటు తనానికి కేసీఆర్ వివక్షనే కారణంగా రేవంత్‌రెడ్డి విమర్శించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వపాలనలో వ్యవసాయరంగానికి పెద్దపీట వేసి అనేక పథకాలు అమలు చేసిన విషయాన్ని కేసీఆర్‌గుర్తు చేసుకోవాలనిసూచించారు. కల్వకుర్తి గడ్డమీద కాంగ్రెస్ పార్టీ జెండానుఎగురవేయాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన ఏఒక్క హామి తొమ్మిదిన్నరేళ్ళ కాలంలో నెరవేర్చలేదని, అధికారంలోకి రాగానే తన కుటుంబ మేలు చూసుకున్నారు తప్ప ప్రజల మేలు మరిచిపోయారన్నారు. మోడీ-కేసీఆర్ కుమ్మక్కై ఎన్నికల ముందు రైతులకు రైతుబంధు వేస్తున్నారని, మరి దళితబంధు, బీసీ బంధు, మైనార్టీ బంధులు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుబంధు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లురవి, సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ప్రచార వాహనాల పరిశీలన

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 25 ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికల సందర్భంగా జిల్లాకు నియమించబడిన ఎన్నికల పరిశీలకులు ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు డా. కుందన్ యాదవ్ వివిధ పార్టీల ప్రచారాల కాన్వాయ్‌లను, వాహనాలను ఇతర అంశాలను పరిశీలించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో భారత రాష్ట్ర సమితికి చెందిన ప్రచార కాన్వాయ్‌ని అందులో ఉన్న వాహనాలు, వాటి అనుమతులు, ఇతర అంశాలను పరిశీలించగా, మహబూబ్‌నగర్ మండలం చౌదర్‌పల్లి వద్ద బిజెపికి చెందిన ప్రచార కాన్వాయ్, వాహనాల అనుమతి తదితర అంశాలను పరిశీలించారు.




వాహనాలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

## ఇబ్రహీంపట్నం గడ్డపై గెలిచేది మల్‌రెడ్డి రంగారెడ్డి

**-ఉప సర్పంచ్ నక్క మహేందర్ యాదవ్**



అయ్యవారిగూడ గ్రామంలో ఉప సర్పంచ్ నక్క మహేందర్ యాదవ్,వార్డు సభ్యులు గ్రామస్థులు

**యాచారం నవంబరు25,ప్రభాతవార్త :** ప్రజల మనసుల్లో కాంగ్రెస్ గెలవాలని ధృడ సంకల్పంతో ఉన్నారని అయ్యగారి గూడెం ఉప సర్పంచ్ నక్క మహేందర్ యాదవ్ పేర్కొన్నారు.శనివారం యాచారం మండల పరిధిలోని అయ్యవారిగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డిని గెలిపించాలంటూ విస్తృతంగా ప్రచారం చేపట్టారు.నాయకులు కార్యకర్తలు, వార్డు సభ్యులు భారీ ఎత్తున ఇంటింటా తిరిగి ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ కెసిఆర్ చేస్తున్న దురహంకారం గురించి తెలుపుతూ ప్రజలను చైతన్య పరిచారు.ఈ కార్యక్రమంలో పోలమోని జంగయ్య,వెంకటయ్య,సామ రమేష్,గౌర రాజు,నక్క శివ తదితరులు పాల్గొన్నారు.

## నందివనపర్తిలో కాంగ్రెస్ పార్టీ ప్రచార ర్యాలీ



నందివనపర్తిలో భారీగా ర్యాలీ నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు

**యాచారం నవంబరు25,ప్రభాతవార్త :** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నెర్రే శ్రీశైలం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి శనివారం ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా యాచారం మండలం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటాని ప్రజలందరూ మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపు కోసం స్వచ్ఛందంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.నందివనపర్తి గ్రామంలో ప్రజలంతా చైతన్యవంతమై మార్పు కోసం మల్‌రెడ్డి వైపు ఉన్నారని కాంగ్రెస్ గెలుస్తుందని గ్రామంలో అధిక మెజార్టీకి కృషి చేస్తున్నామని దీమా వ్యక్తం చేశారు.మార్పు కోరే వారందరూ కాంగ్రెస్ వైపే ఉన్నారని గెలిపే లక్ష్యంగా నాయకులు,కార్యకర్తలు కృషి చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముక్తల యాదయ్య గౌడ్,మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ నేర్ర భాష,సత్యనారాయణ రెడ్డి, ఎండి సాజిద్,ఎండి షాహెద్,సల్తాన్ శేఖర్,ముచర్ల యాదగిరి,సామ మధు,నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల వద్దకు డెమో ఈవీఎం మిషన్



**ఆదిభట్ల నవంబరు25,ప్రభాతవార్త** తెలంగాణలో ఎన్నికల ప్రచార గడువు మరోమూడు రోజులే ఉండడంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని వివిధ పార్టీల కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేస్తూ డెమో ఈవీఎం మిషన్లను చూయించి సీరియల్ నెంబర్లను ,పార్టీ గుర్తులపై అవగాహన కల్పిస్తున్నారు.మహిళ కార్యకర్తలు బొట్టు పెట్టి మాకే ఓటే యాలంటూ అభ్యర్థిస్తున్నారు.తమ నాయకుడు గెలుపు కోసం గుళ్లలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

## అప్పోజిగూడలో బిఆర్‌ఎస్ అభ్యర్థి ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో బిఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య

**మొయినాబాద్, నవంబర్ 25 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మోసపోవద్దని, కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సరిగ్గా కరెంటు ఇవ్వకుండా రైతులను మోసం చేసిందని చేవెళ్ల బిఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య అన్నారు. యాదయ్య మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. శనివారం మండల పరిధిలోని అప్పోజిగూడ, చిలుకూరు, ఎన్కేపల్లి, అమ్డాపూర్, కాశీంబౌలి, శ్రీరాంనగర్, వెంకటాపూర్, హిమాయత్‌నగర్, గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 24 గంటల కరెంటు ఉచితంగా అందిస్తున్నది తెలంగాణ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆచరణలో అమలు కాని వాగ్దానాలను చేస్తోందని అన్నారు. కర్ణాటక రాష్ట్ర రైతులు బిఆర్‌ఎస్ తరఫున ప్రచారం నిర్వహిస్తున్నారంటే తెలంగాణ ప్రభుత్వ పనితీరుకు అదే నిదర్శనమని అన్నారు. ఉచితవిద్యుత్ అందించడంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**విద్యార్థి, నిరుద్యోగులసభకు తరలిన ఎన్‌ఎస్‌యుఐ నాయకులు**

**ఘట్‌కేసర్, నవంబర్ 25, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా తూంకుంటలో శనివారం జరిగిన విద్యార్థి, నిరుద్యోగుల సభకు ఘట్‌కేసర్ మండలం నుంచి ఎన్‌ఎస్‌యుఐ నాయకులు తరలివెళ్లారు. శామీర్‌పేట్ మండలం తూంకుంటలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన విద్యార్థి, నిరుద్యోగుల సభలో ఎన్‌ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షులు నిరాజ్‌కుందన్, రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్ మండలం నుంచి ఎన్‌ఎస్‌యుఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి నానావత్ శివాజీనాయక్, మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షులు చందుపట్ల సాయిచరణ్‌రెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు ఓఆర్‌ఆర్ మీదుగా తూంకుంటకు తరలివెళ్లారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులు ఉద్యోగాలు, ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించారని పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌యుఐ నాయకులు కార్తీక్, నాగరాజు, రాకేశ్, ప్రసాద్, వినోద్, కరుణాకర్ తదితరులు తరలివెళ్లారు.



ఘట్‌కేసర్ నుంచి తరలివెళ్తున్న ఎన్‌ఎస్‌యుఐ నాయకులు

# తెలంగాణలో ముస్లింలకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం అండ

## -రాష్ట్ర హోంమంత్రి మహముద్ అలీ పిలుపు



చేవెళ్లలోని కెజిఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హోంమంత్రి మహముద్ అలీ

**చేవెళ్ల, నవంబర్ 25, ప్రభాతవార్త** తెలంగాణలో ముస్లింలకు బిఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటూ ముస్లీంలకు ప్రత్యేక రిజర్వేషన్‌లను సిఎం కెసిఆర్ ప్రభుత్వమే కల్పించిందని, ఎన్నికల్లో కారుకు గుర్తుకు ఓటు వేసి చేవెళ్ల బిఆర్‌ఎస్ అభ్యర్థి కాలే యాదయ్యని గెలిపించాలి రాష్ట్ర హోంమంత్రి మహముద్ అలీ పిలుపునిచ్చారు.చేవెళ్ల మండల కేంద్రంలోని కెజిఆర్ గార్డెన్‌లో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కార్తీక్‌రెడ్డి,చేవెళ్ళ బిఆర్‌ఎస్ అభ్యర్థి కాలే యాదయ్యతో కలిసి మైనార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హోంమంత్రి మహముద్ అలీ మాట్లాడుతూ కాల రహేతో..దిల్ వాలే హాయే..కాలే యాదయ్య నల్ల గుంటే మనసు మాత్రం వెన్నలాగా ఉందన్నారు. ఎవరు ఎది అడిగిన కాదు అనకుండా అభివృద్ధి చేయడమే తన కర్తవ్యంగా బారిస్తారన్నారు. దేశంలో ఎవరు చేయని పనులను సిఎం కెసిఆర్ చేస్తున్నారని, గాంధీ తరువాత కెసిఆర్ మరో గాంధీలాగా రాష్ట్రంను సాధించడమే కాకుండా అభివృద్ధి చేస్తున్నారన్నారు. మైనార్టీలకు రూ.12000 కోట్లను బడ్జెట్‌ను కేటాయించారన్నారు. ముస్లీం కోసం షాదీ ముబారక్ కోసం రూ.2300 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో 50 లక్షల మైనార్టీలు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపిపి మల్గారి విజయలక్ష్మి, చేవెళ్ల జడ్పిటిసి మర్పల్లి మాలతీ,వైస్ ఎంపిపి శివప్రసాద్, మాజీ ఎంపిపి బాల్‌రాజ్, విజయభాస్కర్‌రెడ్డి,ఖానాపూర్ ఎంపిటిసి వాసవి నారాయణ,బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి, సర్పంచులు జాంగీర్, నరహరిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి,మాణిక్యరెడ్డి, సురేందర్,బీమయ్య, వెంకటేశంగుప్తా, మండల పార్టీ అద్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, నాయకులు క్రిష్ణారెడ్డి,కావడి తిరుపతిరెడ్డి, జూకన్నగారి జైపాల్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రాంరెడ్డి, ఎంఎంసి వైస్ చైర్మన్ నర్సింలు, బ్యాగరి నర్సింలు, మంగళి యాదగిరి, దండు సత్యనారాయణ, గుత్తి మల్లేష్, ఒగ్గు హరిష్ తదితరులు పాల్గొన్నారు.

## జయరాంరెడ్డిని కలిసిన వజ్రేశ్‌యాదవ్



ప్రముఖ వ్యాపారవేత్త,సేవాతత్పరుడు ఐలేని జయరాంరెడ్డిని కలిసిన మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ కలిసి మద్దతు కోరిన దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 25, ప్రభాతవార్త** రాష్ట్రంలోనే ప్రముఖ వ్యాపార వేత్త, మేడ్చల్ నియోజకవర్గంలో సామాజిక సేవా తత్పరుడు ఐలేని జయరాంరెడ్డిని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్ యాదవ్ మర్యాదపూర్వకంగ కలిసి కాంగ్రెస్ గెలుపునకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. శనివారం మేడ్చల్ జిల్లా కీసరలోని ఆయన జయరాంరెడ్డిని ఫామ్‌హౌస్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్కైలాబ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన కలిశారు. రాష్ట్రంలోనే ప్రముఖ పారిశ్రామిక, వ్యాపారవేత్తగ, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఐలేని జయరాంరెడ్డిగా ప్రజల్లో ఉన్నారని అన్నారు. ఐలేని జయరాంరెడ్డి ప్రముఖ పారిశ్రామిక వేత్తగ రాణిస్తూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో జయరాంరెడ్డికి మంచి ప్రజాదరణ ఉందని అన్నారు. స్వయం కృషి స్వచ్ఛంధ సంస్థ ద్వారా దివ్యాంగులకు, మానసిక వ్యాధిగ్రస్తులకు, చిన్నారులకు అనేక సంవత్సరాలుగ ఉచితంగ సేవలు అందిస్తున్నారని అన్నారు. ఎన్నికల తేదీ సమీపిస్తుండటంతో మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ జయరాంరెడ్డిని కలవటం నియోజకవర్గ పరిధిలోనే చర్చనీయాంశంగ మారింది. జయరాంరెడ్డి మద్దతు కాంగ్రెస్‌కు విజయాన్ని చేకూర్చే అవకాశం ఉన్న నేపథ్యంలో దీంతో మేడ్చల్‌లో బిఆర్‌ఎస్ అభ్యర్థికి గట్టి షాక్ తగులనుందని పేర్కొన్నారు. ఆయనతో పాటు దీనిలో మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌తో పాటు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్కైలాబ్‌రెడ్డి కూడ పాల్గొని కాంగ్రెస్ పార్టీకి పూర్తి మద్దతు పలికి విజయానికి కృషి చేస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల ఆదరణ పెరిగిందని, ఓటర్లు కూడ మార్పును కోరుతున్నారని, ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఈ ఎన్నికల్లో గెలిపించానికి ఆదరిస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్ పేర్కొన్నారు.

# బలగమే బలం..

**-అనుచరులను నమ్మలేకపోతున్నఅభ్యర్థులు**

**-కుటుంబసభ్యులు, బంధువులతోనే అన్నిపనులు**

**-లావాదేవీలు, ఖర్చు వ్యూహ ప్రతివ్యూహాలు బాద్యత వారికే**

**-పోల్ మేనేజ్‌మెంట్‌పైనా ప్రణాళికలు**

**హైదరాబాద్,నవంబర్ 25,ప్రభాతవార్త:** నగరంలోని ఒప్రధాన పార్టీ అభ్యర్థి తరనపున వారి కుటుంబసభ్యులు, బంధుగణమే అన్న చూసుకుంటుంది. వీరు చెప్పిన ప్రకారమే పోల్ మేనేజ్‌మెంట్ జరుగుతుంది. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుంది. లోటుపాట్లు ఎక్కడొచ్చాయి. పార్టీ ఎక్కడ బలహీనంగా ఉంది. అలకలు ఎక్కడెక్కడ ఉన్నాయి. వారిని ఎలా బుజ్జగించాలి వంటి బాద్యతలు చూసుకుంటున్నారు.అలాగే మరో ప్రధాన పార్టీ అభ్యర్థి పోల్ మేనేజ్‌మెంట్ పక్కా నిర్వహించేలా తన పిల్లలు, అల్లుళ్ల దగ్గరి బంధువులకు ప్రధాన బాద్యత అప్పగించారు. ప్రచార ఖర్చులు, కార్యకర్తలు చేజారిపోకుండా ఉండేందుకు ద్వీతీయ శ్రేణి నాయకులకు అవసరమైన డబ్బులు, ఇతర ఖర్చుబాధ్యత వీరే చూసుకుంటున్నారు,

ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో ఇంకో ప్రధానపార్టీ అభ్యర్థి కూడ తన సతీమణి, వారి సోదరులు,బామ్మర్దులను రంగంలోకి దింపారు. గతంలో జరిగిన పొరపాట్లకు తావివ్వకుండా పోల్ మేనేజ్‌మెంట్ పక్కాగా జరిగేలా వీరు ప్రణాళికలు సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు. ఇలా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ముఖ్యంగా ఖర్చు అదుపు తప్పకుండా అనవరసర ఖర్చును నిరోధించేందుకు అనివార్యంగా వీరిని రంగంలోకు దింపుతున్నారు. ఎన్నికల సమయంలో ఎవరిని నమ్మాలో ..ఎవరని నమ్మకూడదో అర్థం కాని పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అభ్యర్థులు ఈసారి వారి కుటుంబసభ్యులు ,బంధువులను రంగంలోకి దింపారు. కీలకమైన బాధ్యతలన్నీ వారికే అప్పగించారు. డబ్బు, ప్యాకేజీలు, కోవర్టు ఆపరేషన్లు, మారుతున్న సమీకరణాలతో లావాదేవీలు, చర్చలు, నిధుల సమీకరణ, ఖర్చు వ్యూహ ప్రతివ్యూహాలు అన్నీ వీరే చూసుకుంటున్నారు.

**ప్రత్యర్థుల వ్యవహారాలపైనా..**

ఓటర్లను అతమకు అనుకూలంగా మార్చుకునేందుకు,ముఖ్యమైన కార్యకలాపాలను పక్కా కొనసాగించేందుకు, ప్రత్యర్థుల వ్యవహారాలపైనా దృష్టిపెడుతున్నారు. ఎత్తులు, పైఎత్తులు వేసుకుంటూ ముందుకు కదులుతున్నారు. మరోవైపు ఏవర్గం ఓట్లు ఎటువైపు ఉన్నాయి. .ఆయా ఓట్లు ఏవిధంగా నమోదయ్యే అవాకాశముంది.. చీలిపోతాయా అనే విషయాలపైనా అభ్యర్థుల తరపున వారి కుటుంబ సభ్యులు, బంధువులు లెక్కలు వేసుకుంటున్నారు. వీటితోపాటు డివిజన్, వార్డు ,పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాను తీసుకుంటున్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాను దగ్గర ఉంచుకుని ఒక్కో ఓటరు వివరాలను ఆరాతీస్తున్నారు. ఫోన్‌నెంబర్లు సేకరించి వారికి ఫోన్ చేస్తూ పోలింగ్ రోజు తమపార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

**ఏం కావాలి..ఏం చేయాలి..**

ఓవైపు ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం హోరాహోరీగా కొనసాగుతుం దగా.. మరోవైపు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నారు. ఇప్పటివరకు ఏం చేశారు..ఇక ముందు ఏం చేస్తారు..తమకేంటి ప్రయోజనం వంటి ప్రశ్నలు ఓటర్లనుంచి వస్తుండటంతో వారిని ఎలాగైనా ప్రసన్నం చేసుకునేలా పార్టీల్లోని ప్రధాన నేతలు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. మీకాలనీకి ఏంకావాలి..ఎలాంటి పనులు అవసరం ఉందో జాబితాను తయారు చేసి ఇవ్వండి. .అభ్యర్థి గెలిచిన వెంటనే పనులు చేసి పెట్టేబాధ్యత మేమే చూసుకుంటామని వారి ఓట్లు రాబట్టేందుకు అభ్యర్థుల తరపున పార్టీల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించే నేతలు హామీ ఇవ్వడంతోపాటు మందు,విందు పార్టీలు ఏర్పాటు చేస్తున్నారు.

## కోర్టు ఆవరణలో శిక్షణ కార్యక్రమం

**సంగారెడ్డి టౌన్, నవంబరు 25, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు, జిల్లా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకరరావు అధ్యక్షతన జిల్లా న్యాయ ఏవాధికార సంస్థ కార్యదర్శి జె హన్మంతరావు ఆధ్వర్యంలో పారా లీగల్ వాలంటీర్లు, న్యాయ సేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్‌రావు మాట్లాడుతూ జునినైల్ జస్టిస్ చట్టం, పిడిసిఎస్‌ఓ చట్టం, గృహ హింస చట్టం, వరకట్నం నిషేద చట్టం, బాల్య వివాహాల నిషేద చట్టం, న్యాయ సేవాధికార సంస్థ నందు లభించే ఉచిత సేవలపై వివరిస్తూ శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న పారా లీటల్ వాలంటీర్లకు కార్డులను పంపిణి చేశారు. కార్యక్రమంలో మొదటి, మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి సుదర్శన్, జి సునీత రవీంద్రారెడ్డి, సీనియర్ సివిల్ జడ్జీం రాధాక్రిష్ణాచౌహాన్, న్యాయమూర్తులు, న్యాయవాదులు శాలినీ, లక్ష్మణచారి, అనిత, తేజశ్రీ, విఠల్‌రెడ్డి, గౌతమి, బుచ్చయ్య,పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## నేడు గుడ్‌పల్లిలో సిద్దాపీర్ దర్గా ఉర్సు

**జహీరాబాద్, నవంబరు 25, ప్రభాతవార్త:** ఈ నెల 26న మొగుడంపల్లి మండలంలోని గుడ్‌పల్లి గ్రామంలోని సిద్దా పీర్ దర్గా ఉర్సు ఉత్సవాలకు దుర్గాను ముస్తాబు చేసినట్లు ఉత్సవ కమిటి నిర్వాహకులు దర్గా ముత్తప్లి ముఫ్తి సయ్యద్ మోహినోద్దిన్ ఖాద్రి తెలిపారు. ఆదివారం సాయంత్రం జాల్సా, అన్నదానం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రాత్రి 9 గంటలకు ఖవలి ఉస్తాదులచే ఖవాలి కార్యక్రమం ఉంటుందన్నరు. ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనేందుకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, భక్తుల సౌకర్యార్థం తగు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఓటును సద్వినియోగం చేసుకోవాలి

**-గృహ కార్మికులతో సిఈఓ ఎల్లయ్య**

**సంగారెడ్డి టౌన్, నవంబరు 25, ప్రభాతవార్త:** ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ కార్యనిర్వాహణ అధికారి ఎల్లయ్య సూచించారు. మెద్వన్, యండిపై, యాఫ్, యమ్ యస్ఐఅ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం శనివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని మెడవిన్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎల్లయ్య మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా, నిజాయితీగా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును విధిగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. డైరెక్టర్ హెచ్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అమూల్యమైన ఓటును డబ్బులకు, మద్యంకు అమ్ముకోకుండా నిజాయితీగా ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనియన్‌లోని ఉన్న ప్రతి ఓటరు ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిడబ్లూసి సభ్యులు వెంకటేశం, గృహ కార్మికులు, మేద్వాన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఎన్నికల సాగేలా సహకరించాలి

**-రాజకీయ పార్టీ నాయకులతో జిల్లా కలెక్టర్**



రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం అయిన జిల్లా కలెక్టర్ శరత్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 25, ప్రభాతవార్త:** ఈ నెల 30న జిల్లాలోని 5 శాసన సభ స్థానాల్లో జరుగనున్న ఎన్నికలను పారదర్శకంగా సాగేలా రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు తమ వంతు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీల నాయకులకు కలెక్టర్ పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ శరత్ మాట్లాడుతూ ఎన్నికల రోజు పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు ఎన్నికల కమీషన్ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. పోలింగ్ బూత్ నుంచి 200 మీటర్ల పరిధిలో ఎలాంటి ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును సద్వినియోగం చేసుకునేలా చైతన్య పర్చాలన్నారు. ఎన్నికల అధికారులకు తమ వంతు సహకరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, డిఆర్‌ఓ నగేష్, ఎన్నికల విభాగపు అధికారి దశరథ్, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**జప్తు చేసిన నిధుల విడుదల : జిల్లా కలెక్టర్ శరత్**

సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 25, ప్రభాతవార్త: 50వేల రూపాయలకు మించి ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండగా సీజ్ చేసిన నగదును విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చాక జిల్లా వ్యాప్తంగా 168 కేసులలో 5 కోట్ల 5లక్షల 68వేల 962 రూపాయలను జప్తు చేయడం జరిగిందన్నారు.168 కేసులలో జప్తు చేసిన నగదుకు సంబంధించి 157 కేసులలో తగు ఆధారాలు ధాఖాలు చేయడంతో 3కోట్ల 40లక్షల 46వేల 738 రూపాయలను విడుదల చేశామన్నారు. 11కేసులకు సంబంధించి సరైన ఆధారారలు సమర్పించనందున 1 కోటి 65లక్షల 22వేల 224 రూపాయలను విడుదల చేయలేదని కలెక్టర్ శరత్ వివరించారు. సరైన ఆధారాలను జిల్లా గ్రీవిన్స్ కమిటిలో సమర్పించి తమ నగదును తీసుకోవాలని సంబంధితులకు కలెక్టర్ సూచించారు.

## వజ్రేశ్‌యాదవ్‌కు మద్దతుగా ఇంటింటికి ప్రచారం

**- కాంగ్రెస్ 6 గ్యారెంటీల అమలు**



ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

**ఘట్‌కేసర్, నవంబర్ 25, ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే సోనియాగాంధీ ప్రకటించిన 6 గ్యారెంటీల పథకాలను అమలు చేస్తుందని ఘట్‌కేసర్ మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ బొక్క సంగీతా ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో శనివారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఓటింగ్ బ్యాలెట్ ఈవీఎంపై చేతి గుర్తును నొక్కి చూపిస్తూ ఓటర్లకు అవగాహన కల్పించారు. మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌కు మద్దతుగా నాయకులు 6 గ్యారెంటీల పథకాల కరపత్రాలను ఓటర్లకు చూపిస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. ఈనెల 30 జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి వజ్రేశ్ యాదవ్‌కు ఓటు వేసి అవినీతి, నియంత, కుటుంబపాలనకు చరమగీతి పలకాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ చల్లా శోభారాణి, నాయకులు బొక్క సతి_రెడ్డి, బీవీ రవి, చిత్తరంజన్‌రెడ్డి, పద్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి




సంస్కృతి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న హనీవెల్ డైరక్టర్ సురేశ్

**ఘట్‌కేసర్, నవంబర్ 25, ప్రభాతవార్త:** విద్యార్థులు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని హనీవెల్ కంపెనీల డైరక్టర్ సురేశ్ పల్లె అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌లోని సంస్కృతి కళాశాలలో శనివారం జరిగిన 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ యూత్ ఎంపవర్మెంట్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. హనీవెల్ మద్దతుతో అభివృద్ధి చెందుతున్న ప్రాజెక్టు, వ్యక్తుల విజయగాథలను ఆయన తెలియజేశారు. అకాడమిక్ ఎక్సలెన్స్ పెరిగిన ప్లేస్‌మెంట్ అవకాశాల మధ్య కీలకమని పరిశ్రమల అంచనాలను ఆయన వివరించారు. ఔత్సాహిక ఇంజనీర్లకు స్ఫూర్తిదాయకమైన ప్రమాణాలుగా పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆధునిక ఇంజనీర్లు క్లిష్టమైన మార్గాన్ని నావిగేట్ చేయడంలో మార్గదర్శకత్వం కోరుతున్నారని ఇంటరాక్టివ్ సెషన్ అకాడమియా పరిశ్రమల మధ్య వారధిగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎఐ విద్యార్థులు ఆచరణాత్మక అనువర్తనాలపై విస్తృత అవగాహనతో ఆయుధాలతో నూతన ప్రేరణతో భాగస్వాములు అయ్యారు. ఈకార్యక్రమంలో ఐసీటి అకాడమీ డైరక్టర్ ఎన్.అమర్‌నాథ్, ప్రిన్సిపల్ డాక్టర్ ఉదయ్‌కిరణ్, ప్లేస్‌మెంట్ అధికారి నీలమ్ సింగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చాకరిమెట్ల ఆలయంలో కార్తీకమాసం ప్రత్యేక పూజలు

**శివ్వంపేట, నవంబర్25 ప్రభాతవార్త:** ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శివ్వంపేట మండల పరిది లోని చిన్నగొట్టిముక్కుల సమీపంలోని చాకరిమెట్లలో గల శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో భక్తులు అంజన్న స్వామికి అభిషేకం, చందనాభిషేకం, నవగ్రహ పూజలు నిర్వహించడం జరిగింది. స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం కొబ్బరికాయలు కొడుతూ మొక్కులు చెల్లించుకోవడం జరిగింది. ఆలయ పరిసర ప్రాంగణంలోని సత్యనారాయణ స్వామి వ్రతాల మండపంలో అనేక మంది దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించుకొని మొక్కులు చెల్లించుకోవడం జరిగింది. చాకరి మెట్ల ఆంజనేయ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించిన పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ సులువుగా అర్థమయ్యే విధంగా ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ పుణ్యాచరణ ఆచరణాన్ని వినిపించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సార శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవదత్తు శర్మ, అర్చకులు ప్రభురాజశర్మ, దేవిశ్రీశర్మ, శ్రీవాత్స వశర్మ, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

**సంగారెడ్డి టౌన్, నవంబరు 25, ప్రభాతవార్త:** ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగిం చుకోవాలని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెఎస్‌ఎస్ రత్న ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్, స్వీప్ కమిటి, ఈఎల్‌సి, సామాజిక శాస్త్రాల విభాగాల ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రత్న ప్రసాద్ మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా తమ ఓటను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలకు చెందిన 4వందల మందికి పైగా ఎన్‌సిసి క్యాడెట్లు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు వృద్దులు, అంగవైకల్యం కలవారికి, అంధులకు ఓటు వేసుకునేందుకు సహకరించేందుకు వాలంటీర్లుఆ సేవలను అందించనున్నారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, డాక్టర్ వెంకటేశం, ఈఎల్‌సి కన్వీనర్ విశ్వేశ్వర శర్మ, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పద్మజ, శివదీప్తి, డాక్టర్ సిద్దులు, డాక్టర్ అభిజిత్, అధ్యాపకులు డాక్టర్ జ్యోత్న, డాక్టర్ రవికుమార్, ఎల్ వినోద, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ మహంతయ్య, పాల్గొన్నారు.

## వృద్దుల పట్ల అలసత్వం వహిస్తే చట్టరిత్యా శిక్షించబడతారు

**జూనియర్ సివిల్‌జడ్జి ,న్యాయమూరి కె.అనిత**

**నర్సాపూర్, నవంబర్ 25.ప్రభాతవార్త:** వృద్ధుల పట్ల అలసత్వంవహిస్తే చట్టరిత్యా చర్యలు తీసుకొని శిక్షించబడతారని న్యాయమూర్తి జూనియర్ సివిల్‌జడ్జి,మండల్‌లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ చైర్మన్ కె.అనిత అన్నారు. శనివారం నర్సాపూర్‌లోని కోర్టు ఆవరణలో న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈసదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి జూనియర్ సివిల్‌జడ్జి,మండల్‌లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ చైర్మన్ కె.అనిత మాట్లాడుతూగ్రామీణ ప్రాంతాల్లో వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణ మరిస్తె వారి ద్వార వారసులకు సంక్రమించిన స్థిర ఆస్తులను తిరిగి వారికి చట్టబద్ధంగా చెందుతాయని తెలిపారు.వృద్ధులైన తల్లిదండ్రుల ఆలనా పాలనా సక్రమంగా చూసుకునే బాధ్యత వారసులదేనన్నారు. ఇటీవల కుటుంభ సభ్యులు మా నుండి స్థిరాస్తులను వాటాలుగా తీసుకొని పంచుకుంటు మా వృద్ధ జీవితాన్ని పట్టించుకోవడం లేదని ,మా జీవితాలు అయోమయంగా ఉన్నాయని,మమ్ములను చట్టబద్ధంగా కాపాడాలని మండల్‌లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ కోర్టుకు సంబందించి నటువంటి పిఎల్‌సి కేసులు వస్తున్నాయని తెలిపారు.యాక్సిడెంట్ ద్వార ప్రమాదవశాత్తున మరణిస్తే ప్రమాదానికి కారణమైనటువంటి వాహనాలకు ఇన్సురెన్స్ ,లైసెన్స్ లేకుండా ఉండటం వల్ల బాధితులకు ఇన్సురెన్స్ అందక ఇబ్బందులకు గురవుతున్నామని మండల్‌లీగల్ సర్వీస్ కమిటీ కోర్టును ఆశ్రయిస్తున్నారని అన్నారు. పేద ప్రజలు వారికి అన్యాయం జరిగినప్పుడు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ద్వార న్యాయ సలహాలు పొంది వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆమె సూచించారు.అనంతరం పిఎల్‌సి కేసులను ఆమె పరిష్కరించారు. ఈకార్యక్రమంలో లీగల్ సర్వీస్ న్యాయవాది స్వరూపరాణి, కోర్టు సూపరిండెంట్ జంగా శ్రీనివాస్,లీగల్ సర్వీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది,వివిద గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

